
తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో
రు. 300 గెలుపొందిన రచన




అది బొంబాయి మహానగరం.

సాయంత్రం వేళ పార్కులో ఒంటరిగా కూర్చుని వున్న గోపిని పలుకరించాడు ప్రభాకర్.

"హలో గోపీ! ఇదేవిటి-కొత్త పెళ్లికొడుకువి ఇలా ఒంటరిగా కూర్చుని వున్నావ్? మీ ఆవిడ ఊళ్ళో లేదా? ఇది విరహ వేదనా?"

"ఊళ్ళోనే వుంది" ముక్తసరిగా జవాబిచ్చాడు గోపి.

ఇంకా జోకులేయబోయి, గోపి మొహం చూసి ఆగిపోయాడు. సంగతేదో సీరియసే నని గ్రహించి ప్రశ్నలడిగి అసలు విషయం రాబట్టాడు.

"మా ఆవిడ. ఎం.ఎస్‌సి. మాథ్స్ అని నీకు

## రచయిత్రి స్వపరిచయం



నెల్లూరులో పుట్టి, తిరుపతిలో ఎం.ఎ. (ఇంగ్లీషు లిట్) పట్టా పుచ్చుకొని, బాపట్లలో మెట్టి, ప్రస్తుతం బొంబాయిలో కాపురం చేసుకుంటున్న పగటు తెలుగు ఆడబడుచును. ప్రింటులో నా పేరు చూసుకోవటమనేది ఈ మధ్యనే మొదలయింది. కనుక, పాఠకులందరూ సహృదయంతో నా తప్పులు మన్నించి, నన్ను ప్రోత్సహిస్తారని ఆశిస్తాను. ప్రోత్సహించమని ముకుళిత హస్తాలతో మనవి చేసుకుంటున్నాను.

—మల్లాది లక్ష్మి, బొంబాయి

తెలుసు కదా. కాపురానికొచ్చిన రోజునుంచి ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే వుంది. ఈ లోపల టైం వేస్ట్ దేనికని ట్యూషన్లు మొదలెట్టింది. నెలకు వెయ్యి పైనే సంపాదిస్తోంది'' చెప్పాడు గోపి.

''మంచిదేగా!''

''మంచిదే కాని, అక్కడే వచ్చింది చిక్కంతా. ఇంటి పనుల్లో కల్పించుకోదు. అమ్మతో, వదినతో అసలు మాట్లాడదు. టైంకు భోజనానికి రాదు. పని తెమలనివ్వదు. అమ్మ నచ్చచెప్పబోతే తలబిరుసుగా జవాబిచ్చిందట. అంతే, ఏముంది? ముగ్గురాడవాళ్ళూ మాటా మాటా అనుకున్నారు. అలా మొదలయిన గొడవ రోజురోజుకూ పెద్దదవుతోంది. నాకూ, అన్నయ్యకూ ఇంటికెళ్లాలంటేనే భయంగా వుంది. అసలు పెళ్ళెందుకు చేసుకున్నానా అని విసుగ్గా వుంది'' దిగులుగా అన్నాడు.

గోపి భుజం తట్టాడు ప్రభాకర్. ''చీర్ అప్ బదర్! ఇలాటివన్నీ సీరియస్‌గా తీసుకోకూడదు. అన్నీ వాటంతటవే సర్దుకుంటాయిలే. ఈ పక్క వీథిలో మా పెదనాన్న కూతురు సరోజ వుంది. వాళ్ళింటికెళ్ళి ఓ పదినిముషాలు కూర్చుని ఇళ్ళకు బయలుదేరుదాం పద.''

గోపి మొహమాటపడుతుంటే బలవంతంగా లాక్కెళ్ళాడు ప్రభాకర్.

* * *

వీళ్ళు వెళ్ళేసరికి సరోజ వాళ్ళ ఫ్లాట్ తాళం వేసి వుంది. ఎదుటి ఫ్లాట్ గంట కొట్టాడు ప్రభాకర్. తలుపు తెరుచుకుంది. ఆ గదిలోకి చూసిన గోపి వులిక్కిపడ్డాడు. ఆ గదిలో చిన్నా పెద్ద అంతా కలిపి దాదాపు పదిహేనుమంది ఆడవాళ్ళు కూర్చుని 'సింధుభైరవి' సినిమా వీడియోలో చూస్తున్నారు.

సరోజ బయటికొచ్చి వీళ్ళను తన ఫ్లాట్‌కు తీసుకొనిపోయింది.

కాసేపయ్యాక, ఇక వుండబట్టలేక మనసులో మాట బయటపెట్టేశాడు గోపి. ''ఆ ఇంట్లో అంతమంది ఆడవాళ్ళుండీ, ఇల్లు అంత నిశ్శబ్దంగా వుండటమనేది చాల ఆశ్చర్యంగా వుంది.''

నవ్వింది సరోజ. ''ఇందులో ఆశ్చర్యమేముంది? అది వీడియో మహిమ. సినిమా పిచ్చిలేని ఆడవాళ్ళు వుండరేమో. అందులోనూ ఈ ఊళ్ళో మన తెలుగు, అరవం సినిమాలు దొరకటమే కష్టం.''

ఆ మాటలు గోపి మనసులో ఆలోచనలు రేకెత్తించాయి.

''నీకూ వస్తున్నదిగా వీడియో! మీ మరిది అమెరికా నుంచి తెస్తున్నాడంటివే'' అడిగాడు ప్రభాకర్.

చప్పరించింది సరోజ. ''అంత అదృష్టం కూడానా! ఈసారి తేవద్దులే అని మా 'రిమోట్ కంట్రోల్'గారు రాసేశారట.''

గోపికి అర్థం కాలేదు.

వివరించాడు ప్రభాకర్. ''సరోజ వాళ్ళ అత్తగార్ని 'రిమోట్ కంట్రోల్' అంటుంది. ఆవిడ గుంటూరు నుంచి అందరి కొడుకుల్నీ కంట్రోల్ చేస్తూ వుంటారట.''

నవ్వొచ్చింది గోపికి.

''వీడియో పోతే పోయింది. మీ పాత టి.వి.ని కలర్ టి.వి.కి ఎక్స్ఛేంజ్ చేసుకోవడం ఏమయింది?''

నిట్టూర్చింది సరోజ. ''అదీ అంతే. షరా మామూలే. బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌గారు బ్రేకేశారు.''

అడక్కుండానే వివరించాడు ప్రభాకర్. ''వీళ్ళ మామగార్ని సరోజ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అంటుంది. వీళ్ళు ఏం చేయాలనుకున్నా ఆయన ఓసారి బ్రేక్ వేయకుండా వుండరట.''

ముందునవ్వొచ్చినా, తర్వాత బాధేసింది గోపికి. ఇలాటి చిన్న చిన్న చికాకులు అందరిళ్ళల్లోనూ వుండేవేనన్నమాట!

తనే అంది సరోజ. ''ఉగాది అయ్యాక మా అత్తగారు, మా మామగారు మా దగ్గరకొచ్చి ఓ మూడునెలలు వుండాలనుకుంటున్నారు. నేనసలు వీడియో అడిగిందే వీళ్ళకోసం. ఇక్కడ వాళ్ళకు భాష రాదు. తోచదు. వీడియో అయినా వుంటే కాస్త కాలక్షేపం అవుతుందనుకున్నాను. ఏదీ లేకపోతే ఏముంది? పొద్దస్తమానం ఇంట్లో కూర్చుని మాటల బాణాలు విసురుకోవడమే అవుతుంది. దాంతో వాళ్ళు ఓ నెలలోనే పెట్టే బేడా సర్దుతారు. దాని మూలంగా నాకు మావారితో గొడవ.''

గోపి మనసులోని ఆలోచనలు ఓ రూపం దిద్దుకున్నాయి. కాసేపయ్యాక స్నేహితులిద్దరూ బయలుదేరారు.

* * *

రెండు నెలలు గడిచిపోయాయి.

ఓ రోజు ప్రభాకర్ ఇంటికెళ్ళాడు గోపి.

కొంచెంసేపు కబుర్లు చెప్పాక అసలు సంగతి చెప్పాడు. ''ప్రభాకర్! అసలు నేనొచ్చింది నీకు కృతజ్ఞతలు చెప్పుకుందామని. ఆ రోజు నన్ను నీవు మీ కజిన్ సరోజ ఇంటికి తీసుకెళ్ళడం చాలా మంచిదయింది. ఆవిడ మాటలు విన్నాక నాకూ ఓ ఐడియా వచ్చింది. అన్నయ్యతో సంప్రదించి, మా ఆవిడకు తెలీకుండా అప్పుచేసి ఇంట్లో ఓ కలర్ టి.వి., వి.సి.పి. కొని పడేశాను. ఇప్పుడు ఇల్లు కాస్త ప్రశాంతంగా వుందనుకో. బహుశ ఇది తుఫాన్ ముందు వచ్చే నిశ్శబ్దం కావొచ్చు. ఏమయినా నేను ఆ తుఫాను, ప్రళయమూ వచ్చేలోపలే ఇల్లు కొనాలని ప్రయత్నిస్తున్నాను. ఇంకో ఆర్నెల్లు పట్టొచ్చు. ఈ ఆర్నెల్లూ ఇల్లు కాస్త ఈ మాత్రంగా వుంటే చాలు.''

''ఇంట్లో అసలు గొడవలే లేవా?'' ఆశ్చర్యంగా ఆరా తీశాడు ప్రభాకర్.

''దాదాపు లేనట్లే. ముగ్గురూ కలిసి సినిమాలు చూస్తున్నారు. మిగతా టైంలో కూడా ఆ సినిమా కబుర్లే. ఆ క్యాసెట్ల ఖర్చు మా ఆవిడదే కనుక ఆవిడ పనిచేయడం లేదని మా అమ్మ నసపెట్టటం లేదు. పిల్లల చదువు పాడవుతోందని మాత్రం మా అన్నయ్య గోలపెడుతున్నాడనుకో. అది వేరే సంగతి. ఈ వీడియో ఫీవర్ వీళ్ళకిలా వుండగానే నేను బయటపడితే అందరికీ పరువు, మర్యాదగా వుంటుంది.''

వింటూండిపోయాడు ప్రభాకర్.

''ఎక్కడ లైఫ్‌బాయ్ వున్నదో అక్కడ ఆరోగ్యమున్నది'' రేడియోలోంచి అడ్వర్‌టైజ్‌మెంట్ ఇద్దరికీ వినిపించింది.

నవ్వుతూ అన్నాడు ప్రభాకర్. ''ఏ ఇంట వీడియో వున్నదో...''

''ఆ ఇంట సుఖశాంతులున్నవి'' తానూ హాయిగా నవ్వుతూ పూర్తిచేశాడు గోపి.

●